క్లుప్తంగా

మేడే పోస్టర్ ఆవిష్కరణ



ఆర్మూర్: ఆర్మూర్‌లోని దేశాయి బీడీ హెడ్ ఆఫీస్ వద్ద మే డే పోస్టర్లను ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీయూసీఐ సంయుక్త జిల్లా అధ్యక్షుడు ముత్తన్న, నాయకులు జి అరవింద్, ఎం నజీర్, తూర్పాటి శ్రీనివాస్, నిమ్మల నిఖిల్, కార్మికులు పాల్గొన్నారు.

ఆలయం పరిశీలన



ఎడపల్లి: మండలంలోని జానకంపేటలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి దుండగులు ప్రధాన ముఖ ద్వారం తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. హుండీ తలుపులు తెరుచుకోకపోవడంతో ఎలాంటి నగదు చోరీకి గురికాలేదు. కార్యాలయంలోని బీరువాలను ధ్వంసం చేశారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ రఘునాథ్ ఫిర్యాదు మేరకు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీం సేకరించిన వేలిముద్రల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తామని ఎస్సై తెలిపారు.

పంపుసెట్టు అందజేత



మాక్లూర్: మండలంలోని కల్లెడి రామమందిర్ వద్ద బోరుబావికి గ్రామ స్నేహ యూత్ సభ్యులు గురువారం పంపుసెట్టును విరాళంగా అందించారు. స్నేహ యూత్, రామమందిర కమిటీ సభ్యులు రాజు, వినోద్, మనీష్‌గౌడ్, గంగారాం, రంజిత్, రాజేశ్, రాకేశ్, భరత్, నవీన్, నరేందర్, సతీశ్, రవి, శేఖర్ పాల్గొన్నారు.

30న మహనీయుల జయంతి ఉత్సవాలు

రుద్రూర్: బోధన్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30న మహనీయులు మహాత్మా జ్యోతిబా పూలే, అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి దాసరి శ్యామ్ తెలిపారు. దీనికి సంబంధించిన ఉత్సవాల కరపత్రాలను రుద్రూర్ మండల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. ఉత్సవాలకు బహుజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పడగల్‌లో బడిబాట



వేల్పూర్: మండలంలోని పడగల్‌లో ప్రైమరీస్కూలు ఉపాధ్యాయులు గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలను వివరించారు. ప్రైమరీస్కూలులో కూడా కంప్యూటర్‌తో కూడిన ఇంగ్లిషు విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సరోజిని, టీచర్లు శంకర్, రేణుక, రాకేశ్, నాగరాజు, ప్రవీణ్, అజయ్ పాల్గొన్నారు.

ఘనంగా టెండుల్కర్ జన్మదినం

పెర్కిట్: అంకాపూర్‌లో క్రికెట్ మాస్టర్ సచిన్ టెండుల్కర్ జన్మదిన వేడుకలను క్రీడాభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. కేకును కట్ చేశారు. కార్యక్రమంలో గంగారెడ్డి, వినోద్ రెడ్డి, భరత్, నవీన్, అనంత్ రెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడను ప్రోత్సహించాలి



బాల్కొండ: కబడ్డీ క్రీడను మరింత ప్రోత్సహించాలని కబడ్డీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య అన్నారు. గురువారం ముప్కాల్ బాల్కొండలో భూదేవి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం మరింత సహకరించాలన్నారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన క్యాంపుల గురించి చర్చించారు. ప్రధాన కార్యదర్శి గంగాధర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



పెర్కిట్: మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని హెచ్‌ఎం హరిత, వీడీసీ సభ్యులు ప్రారంభించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాఠశాలలో పీఈటీ మధుసూదన్ శిక్షణ లో నిర్వహించే వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరా న్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీడీసీ సభ్యులు టి సుమన్, అశోక్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభమయ్యేనా?

- నెల రోజులు గడుస్తున్నా తరలని ధాన్యం
- ధాన్యం కుప్పల వద్ద పడికాపులు కాస్తున్న రైతులు



ధాన్యం కుప్పల వద్ద రైతుల పడిగాపులు



బాద్గుణలో ధాన్యం కుప్పలు

నందిపేట్ : వరికోతలు పూర్తయి నెల రోజులు గడుస్తున్నా నందిపేట మండలంలోని బాద్గుణతో పాటు పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో రైతులు నెల రోజులుగా ఆరబోసిన ధాన్యం కుప్పలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోళ్లు జరగక కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం ఎక్కడ తడిచిపోతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామంటు చెబుతున్నారే కానీ ఇంకా ప్రారంభించకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నెల రోజుల క్రితమే కోతలు



వరి పంటను నెల రోజుల క్రితం కోతలు కోసాము. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రం ప్రారంభం కాలేదు. ప్రతిరోజు ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించాలి. – జితేందర్‌రెడ్డి, బాద్గుణ

అధికారులు పట్టించుకోవడం లేదు



కొనుగోలు కేంద్రం ప్రారంభమై అధికారులు నాన్చుడు ధోరణిని అవలంభిస్తున్నారు. హమాలీలు దొరకక పోవడంతో జాప్యం జరుగుతుందని చెబుతున్నారే కానీ సమస్యను పరిష్కరించడం లేదు. – పిప్పెర శ్రీనివాస్‌రెడ్డి, బాద్గుణ

హమాలీల కొరతతో ఇబ్బందులు

బాద్గుణ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని మహిళా సంఘానికి కేటాయించాం. హమాలీల కొరతతో కొంత జాప్యం జరిగింది. సొసైటీ ద్వారానే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి త్వరలో ధాన్యాన్ని తరలిస్తాం. – వసంతరావు, ఇన్‌చార్జి తహసీల్దార్, నందిపేట

సీనియర్ సివిల్ జడ్జిగా శ్రీదేవి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ న్యాయస్థానంలో సీనియర్ సివిల్ జడ్జిగా శ్రీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి కోర్టులో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శిగా విధులు నిర్వహించిన శ్రీదేవి ఆర్మూర్ న్యాయస్థానంలో సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. ఆర్మూర్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరళారాణి, సెకండ్‌క్లాస్ జడ్జి గట్టు గంగాధర్, ఏజీపీ చిన్నారెడ్డి, అడిషనల్ పీపీ ఖాందేశ్ శ్రీనివాస్, బార్ అసోసియేషన్ సభ్యులు జడ్జి శ్రీదేవికి ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, గటడి ఆనంద్, జెస్సు అనిల్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కాలిన మొక్కలకు నీళ్లు



కాలిపోయిన చెట్లకు నీళ్లు పడుతున్న జీపీ కార్మికుడు

డొంకేశ్వర్: మండలంలోని తొండాకూర్, డొంకేశ్వర్ శివార్లలో రైతులు తమ పొలాలకు నిప్పు పెట్టడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న హరిత హారం మొక్కలు కాలిపోయిన విషయాన్ని 'సాక్షి'లో బుధవారం ప్రచురించింది. స్పందించిన ఎంపీడీవో బ్రహ్మానందం జీపీ కార్మికులతో గురువారం ట్యాంకర్ ద్వారా కాలిన మొక్కలకు నీటిని అందించారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

ఎడపల్లి: విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎస్సై వంశీకృష్ణారెడ్డి, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ మాధవి పాఠశాలలో పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జోయలుకాస్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవి సురేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంజయ్ సింఘ్వీకి ఘన నివాళి





సంజయ్ సింఘ్వీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు   ఆర్మూర్‌లో..

బోధన్: సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీయూసీఐ ఆలిండియా జనరల్ సెక్రెటరీ సంజయ్ సింఘ్వీ మృతిపై ఆ యూనియన్ జిల్లా, డివిజన్ ప్రతినిధులు, సభ్యులు సంతాపం తెలుపారు. గురువారం బోధన్‌లో సంజయ్ సింఘ్వీ చిత్ర పటానికి యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మల్లేశ్, రెహానా బేగం, పాషా, బీడీ కార్మికులు లక్ష్మి, నాగమణి, పద్మ, రేఖ, యాదమ్మ, భోజమ్మ పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్ సింఘ్వీ చిత్రపటానికి టీయూసీఐ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముత్తన్న, నాయకులు అరవింద్, నజీర్, పద్మ, సునీత, లక్ష్మి, శ్రీనివాస్, స్వరూప పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు ఘన నివాళులు



పొతంగల్‌లో కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న గ్రామస్తులు



కోటగిరి మండల కేంద్రంలో..



కోటగిరిలో నినాదాలు చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

రుద్రూర్/ బాల్కొండ/ ఆర్మూర్‌టౌన్/ కమ్మర్‌పల్లి: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి ప్రజలు ఘన నివాళులు అర్పించారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని గ్రామల్లో ఉగ్రవాదుల దాడులకు నిరసనగా గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కోటగిరి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను ప్రజలు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, యువకులు దహనం చేశారు. భారత్‌లో కులమతాలకు అతీతంగా ప్రజలు జీవించడాన్ని పాకిస్తాన్ ఓర్వలేకపోతోందని, భారతీయుల ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొతంగల్ మండల కేంద్రంలో గ్రామస్తులు, యువకులు, నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. బాల్కొండలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అధికారులు ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. బాల్కొండ మండల కేంద్రంలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. పహల్గాంలో దాడులకు పాల్పడ్డ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సీపీఎం సీనియర్ నాయకులు పెద్ది వెంకటరాములు, పల్లపు వెంకటేశ్ అన్నారు. ఆర్మూర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రం బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు కుతాడి ఎల్లయ్య, సాయిలు, కుల్దీప్ శర్మ, నవీద్ తదితరులు పాల్గొన్నారు. దాడులకు పాల్పడ్డ ఉగ్రవాదులపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నిజామాబాద్ రూరల్, కామారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి వి ప్రభాకర్ పేర్కొన్నారు. కమ్మర్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జమ్ముకశ్మీర్‌లో కేంద్రం శాంతి భద్రతను నెలకొల్పాలని కోరారు. నాయకులు దేవరాం, సారా సురేశ్, కిషన్, అశోక్, సత్తెక్క తదితరులు పాల్గొన్నారు.



ఎస్సారెస్పీ కార్యాలయం వద్ద అధికారులు, సిబ్బంది



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు



కమ్మర్‌పల్లిలో సీపీఐఎంఎల్ నాయకులు

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



ఆలూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో గంగాధర్

పెర్కిట్/ బాల్కొండ : ఆలూర్ మండల కేంద్రంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో గంగాధర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలో పంచాయతీరాజ్ వ్యవస్థ ఒక భాగమని అన్నారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు రాజలింగం, కిశోర్, నవీన్, దినేశ్, వందన, నసీర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జీపీల్లో గ్రామ సభలు నిర్వహించి పంచాయతీరాజ్ వ్యవస్థ గురించి అధికారులు వివరించారు. అనంతరం అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవోలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఆనంద్ నరేశ్, వనజ తదితరులు పాల్గొన్నారు.

దుబాయి ఇండియన్ క్లాసికల్ డ్యాన్స్‌కు శ్రీయాన్షి ఎంపిక



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణానికి చెందిన సదమస్తుల శ్రీయాన్షి ఈనెల 26న దుబాయిలో నిర్వహించే ఇండియన్ క్లాసికల్ డ్యాన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైనట్లు తల్లిదండ్రులు రమణ, సంధ్యారాణి గురువారం తెలిపారు. శ్రీయాన్షి ఆర్మూర్‌లోని నటరాజ నృత్యనికేతన్‌లో డాక్టర్ మృణాళిని వద్ద భారతీయ సాంప్రదాయ నృత్య శిక్షణ పొందుతున్నారు. తమ చిన్నారి అంతర్జాతీయ వేదికపై ప్రదర్శన ఇవ్వడం సంతోషంగా ఉందని తల్లిదండ్రులు అన్నారు.

సాలూరలో శివనామ సప్తాహం ప్రారంభం



శివనామ సప్తాహంలో పాల్గొన్న భక్తులు

బోధన్: సాలూర మండల కేంద్రంలోని వీరశైవ లింగాయత్ సమాజ్ కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన అఖండ శివనామ సప్తాహం ప్రారంభమైంది. శిబిరంలో శివపార్వతులు, వీరశైవుల ఆరాధ్య గురువులు బసవేశ్వరుడు, శివలింగ్ శివాచార్య మహరాజ్ చిత్ర పటాలకు సమాజ్ ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేసి సప్తాహాన్ని ప్రారంభించారు. ఉదయం 5 గంటలకు భజన కళాకారులు, గాయకులు శివనామ సంకీర్తన, మహిళలు పరమ రహస్య గ్రంథ సామూహిక పారాయణం కొనసాగించారు. కార్యక్రమంలో శివాలయం కమిటీ చైర్మన్ లోకప్పగారి లక్ష్మణ్, సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు శివపూజ శంకర్, బాగే శ్రీకాంత్, ప్రతినిధులు, సభ్యులు రాజుపటేల్, బండే గంగాధర్, శివరాజ్, అశోక్ మహరాజ్, ఎన్నే గణపతి తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



బహుమతులను అందజేస్తున్న సంపత్‌కుమార్

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు జీవితంలో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి సంపత్‌కుమార్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో వీడ్కోలు, క్రీడ, సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికతో తమ కెరీర్‌ను ఎంచుకొని లక్ష్యంగా దిశంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన క్రీడ, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలని సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ యాదవ్ అన్నారు. ఆర్మూర్‌లోని కళాశాలలో సీనియర్లకు జూనియర్లు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చదువుతోపాటు ఇతర టెక్నికల్ స్కిల్స్‌పై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాకేశ్, అధ్యాపకులు రాకేశ్‌గౌడ్, అర్చన, శ్రీధర్ బట్టు, రజినీకాంత్, అరవింద్, ప్రమోద్, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి



బాల్కొండ: ఇందిరమ్మ ఇళ్లు మజూరైన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల ను నిర్మించుకోవాలని ముప్కాల్ ఎంపీడీవో ఆనంద్ నరేశ్ అన్నారు. గురువారం ముప్కాల్ మండలం వేంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటింటికి తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ నిబంధనలను వివరించారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టకపోతే రద్దు అవుతాయని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

ఎండాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: పారిశుద్ధ్య కార్మికులు, ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆలూర్ తహసీల్దార్ రమేశ్, మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. ఆర్మూర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు, ఆలూర్ తహసీల్ కార్యాలయంలో ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఎ స్సై గజానంద్, కార్మికులు పాల్గొన్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	మ్యాడ్‌స్క్వేర్(తెలుగు)-11.10, 7.45, మధురం-1.55 జాక్(తెలుగు) 4.50, డియర్ ఉమ-10.30
స్క్రీన్-2	ఓదెల-2-10.00, 1.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-3	జాక్(తెలుగు)-11.15, 8.40 మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-2.10, 5.10
స్క్రీన్-4	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి-10.30, 1.30, 4.30, 7.30,10.30



మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,800	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	90,280		

– నిజామాబాద్ బిజినెస్

తారు వేశారు..

- రెంజర్ల, వన్నెల్(బి) గ్రామాల మధ్య తారు రోడ్డు పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు, రైతులు



తారు వేసిన రెంజర్ల, వన్నెల్(బి) గ్రామాల మధ్య రోడ్డు

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల, బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామాల మధ్య ఉన్న రోడ్డు పనులను ఎట్టకేలకు పూర్తి చేసి తారు రోడ్డు వేశారు. దీంతో ప్రయాణికులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వన్నెల్(బి) నుంచి మోర్తాడ్ మండలం వన్నెల్(బి) మధ్య ఉన్న బీటీ రోడ్డును కలుపుతూ నూతన రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు పీఆర్, ఆర్అండ్ బీ లో లేదు. కానీ గత ప్రభుత్వ హయాంలో నాటి రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని తారు రోడ్డు నిర్మాణానికి ఎస్టీ సబ్ ప్లాన్ నుంచి రూ. 2.8 కోట్ల నిధులను మంజూరు చేయించారు. దీంతో 2023లో పనలకు శంకుస్థాపన చేశారు. కానీ సాధారణ ఎన్నికల తర్వాత రోడ్డు పనుల ఊసే లేకుండా పోయింది. గత జనవరిలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి రోడ్డును పరిశీలించారు. పనులు ప్రారంభమయ్యేల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. దీంతో అదే నెలలో కంకర పనులు పూర్తి చేశారు. మళ్లీ నిధుల సమస్య రావడంతో ప్రభుత్వంతో మాట్లాడి తారు రోడ్డు పనులు పూర్తయ్యేలా కృషి చేశారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. లింకు రోడ్డు కావడంతో మోర్తాడ్, బాల్కొండ, ముప్కాల్, ఏర్గట్ల మండలాల ప్రజలకు దూరభారం తగ్గుతుంది. రోడ్డుకు ఇరువైపుల వందల ఎకరాల భూములు ఉన్నాయి. దీంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండ ఉంటుంది.

ఉపయోగకరంగా ఉంటుంది



రెంజర్ల నుంచి వన్నెల్(బి) వరకు ఉన్న రోడ్డు పనులను పూర్తి చేసేందుకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డికి రుణ పడి ఉంటాం. నిలిచి పోయిన పనులను ప్రభుత్వంతో మాట్లాడి పూర్తి చేయించారు. రోడ్డు పూర్తి కావడంతో ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. – బుల్లెట్ రాంరెడ్డి, రైతు, రెంజర్ల